'గాలికుంటు'తో ప్రమాదం

- పశువులకు గాలికుంటు వ్యాధి ముప్పు
- వ్యాధి నివారణకు ముందస్తు టీకాలు
- ఈ నెల 15 నుంచి వ్యాక్సినేషన్ ప్రారంభం

డెంకాడ: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి అత్యంత ప్రమాదకరమని, పాడిరైతులు, పశు పోషకులు అప్రమత్తం కావాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ వ్యాధిని నిర్లక్ష్యం చేస్తే అన్నివిధాలా నష్టపోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. వ్యాధి ముదిరితే ఒక్కోసారి పశువుల ప్రాణాలు కూడా కోల్పోవచ్చని చెబుతున్నారు. ముఖ్యంగా వ్యాధికి గురైన పశువుల్లో పాలదిగుబడి తగ్గిపోవడంతో పాటు పనిచేసే సామర్థ్యం కూడా తగ్గిపోతుంది. ఈ నేపథ్యంలో ఈ నెల 15వ తేదీ నుంచి వచ్చే నెల(అక్టోబరు) 15వ తేదీ వరకు నెల రోజుల పాటు వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపడుతున్నారు. వ్యాధి రాకుండా ముందస్తు నివారణ చర్యగా టీకాలు వేయనున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అక్కివరం పశువైద్యాధికారి శ్రీకాంత్ కోరుతున్నారు. గాలికుంటు వ్యాధి, లక్షణాలు, నివారణ చర్యలపై ఆయన సూచనలు అందించారు.

ఇవీ లక్షణాలు..

గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు తీవ్రమైన జ్వరం, నీరసం ఉంటుంది. అలాగే నోటి నుంచి చొంగ కారుతుంటుంది. నోరు, కాలిగిట్టల మధ్య పుండ్లు ఏర్పడతాయి. కొంచెం ఎండకు కూడా తట్టుకోలేకపోవడం, చూడి పశువులు బాగా ఈసుకుపోవడం వంటి లక్షణాలు ఉంటాయి.



గాలికుంటు వ్యాధి సోకిన గేదె నాలుకపై ఏర్పడిన పుండు వల్ల ఏర్పడిన గాయం

నష్టాలివే..

గాలికుంటు వ్యాధి సోకిన పశువుల వల్ల చాలా రకాలుగా నష్టాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా పాడి పశువుల్లో పాల ఉత్పత్తి తగ్గుతుంది. పని చేసే పశువుల్లో అయితే పని సామర్థ్యం గణనీయంగా తగ్గుతుంది. దీంతో పాడిరైతు ఆర్థికంగా నష్టపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. పాలు తాగే దూడలు కూడా మరణానికి గురవుతాయి.

టీకాయే మార్గం..

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు వేసుకోవడమే ఉత్తమమైన మార్గం. నాలుగు నెలల వయసు దాటిన పశువులకు టీకాలు కచ్చితంగా వేయాలి. ముందస్తుగా ఈ టీకాలు వేయడం వల్ల వ్యాధి నివారించవచ్చు.



పశువు కాలిగిట్టల వద్ద ఏర్పడిన పుండ్లు

వ్యాక్సినేషన్‌ను సద్వినియోగం చేసుకోండి..

పశువుల్లో గాలికుంటు వ్యాధి నివారణపై పాడిరైతులు అప్రమత్తం కావాలి. జాగ్రత్త పడితేనే పశువులను రక్షించుకోగలం. వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేసే కార్యక్రమం చేపడుతున్నాం. ఈ టీకాలను సద్వినియోగం చేసుకోవాలి. డెంకాడ, అక్కివరం, రఘుమండ గ్రామాలు కేంద్రంగా వ్యాక్సినేషన్ చేపడుతున్నాం. రైతులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

–శ్రీకాంత్, పశువైద్యాధికారి, అక్కివరం గ్రామం

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



యశస్వినిని అభినందిస్తున్న కరాటే అసోసియేషన్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు

డెంకాడ: మండలంలోని జొన్నాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని ఎ.యశస్విని రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికైంది. కొత్తవలసలో ఇటీవల జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు కోచ్ శరత్‌బాబు, జిల్లా కరాటే అసోసియేషన్ సెక్రటరీలు కె.గోపాల్, పి.విజయలక్ష్మి, కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు లక్ష్మణరావు, ప్రధానోపాధ్యాయురాలు జి.లక్ష్మి, వ్యాయామ ఉపాధ్యాయుడు పి.లీలాకృష్ణలు సదరు విద్యార్థినిని అభినందించారు.

కలెక్టర్‌ను కలిసిన కేసలి అప్పారావు



కలెక్టర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అప్పారావు

విజయనగరం: కలెక్టర్ ఎం.రామ సుందర్‌రెడ్డిని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఇటీవల కలెక్టర్ బాధ్యతలు చేపట్టగా, ఆయనను కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి, శుభాకాంక్షలు తెలిపి స్వాగతం పలికారు.

వ్యాధిగ్రస్తులపై వివక్ష వద్దు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జీవనరాణి

విజయనగరంఫోర్ట్: కుష్ఠు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష చూపించవద్దని డీఎంహెచ్‌వో డాక్టర్ జీవనరాణి తెలిపారు. స్థానిక జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, స్టాఫ్‌నర్సులకు కుష్ఠువ్యాధి నిర్ధారణ, నిర్మూలనపై శనివారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె వ్యాధి లక్షణాలు తొలుత వివరించి, తర్వాత నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. చర్మంపై స్పర్శ, నొప్పిలేని మచ్చలు ఉంటే వెంటనే కుష్ఠువ్యాధి నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ అయిన తర్వాత అది ఇతరులకు సోకకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. వ్యాధిని ఎంత త్వరగా గుర్తిస్తే అంత మంచిదని, లేకుంటే అంగవైకల్యం బారినపడే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠు నివారణ అధికారి కె.రాణి తదితరులు పాల్గొన్నారు.

బదిలీ కలెక్టర్‌కు సన్మానం



కలెక్టర్ అంబేడ్కర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

విజయనగరం టౌన్: నగరంలో పౌరసంఘాల ఆధ్వర్యంలో ఇటీవల బదిలీ అయిన కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను శనివారం సత్కరించారు. నేషనల్ క్యాంపెయిన్ ఆన్ దళిత హ్యూమన్ రైట్స్, దళిత బహుజన శ్రామిక యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చిట్టిబాబు తదితరులు కలెక్టర్‌ను దుశ్శాలువ, జ్ఞాపికలతో సన్మానించారు. అనంతరం ఆయన సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో దళిత హ్యూమన్ రైట్స్ ప్రతినిధులు ఉదరపల్లి రాము, డీబీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సియాదుల పార్వతి, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పి.రాజు, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ కో–ఆర్డినేటర్ కె.వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

'గాలికుంటు' నివారణకు చర్యలు తీసుకోండి



వాల్‌పోస్టర్ విడుదల చేస్తున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

విజయనగరంఫోర్ట్: పశువులకు సోకే గాలికుంటు వ్యాధి నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రామసుందర్‌రెడ్డి సూచించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ కార్యాలయంలో గాలికుంటు వ్యాధి నివారణ వాల్‌పోస్టర్‌ను శనివారం ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ నెల 15వ తేదీ నుంచి అక్టోబరు 15వ తేదీ వరకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఉచితంగా వేయడం జరుగుతుందని, పాడిరైతులంతా తమ పశువులకు ముందస్తుగా టీకాలు వేయించాలన్నారు. కార్యక్రమంలో పశుసంవర్ధక శాఖ ఇన్‌చార్జ్ జాయింట్ డైరెక్టర్ దామోదర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి 'చిన్నశ్రీను సోల్జర్స్' చేయూత

విజయనగరం: నగరంలోని ఓ నిరుపేద కుటుంబానికి చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు మజ్జి సిరిసహస్ర చేయూతనందించారు. పాతబస్టాండ్ దగ్గరున్న పుచ్చలవీధికి చెందిన పాండురంగ జనార్ధనరావు వెన్నెముక సంబంధిత వ్యాధితో బాధపడుతూ మంచాపడిన విషయం తెలుసుకున్న ఆమె..ఆ కుటుంబానికి టిఫిన్ షాపు ఏర్పాటుకు అవసరమైన బండి, సామగ్రి, నిత్యావసర సరుకులు అందజేసి మంచి మనసు చాటుకున్నారు. శనివారం ఆమె స్వయంగా వారితో పెట్టించిన టిఫిన్ షాపును ప్రారంభించారు. 'మంచిని పెంచుదాం–మంచిని పంచుదాం' అనే లక్ష్యంతో చేపట్టిన చిన్నశ్రీను సోల్జర్స్ సంస్థ ద్వారా పేదలకు అండగా నిలవడం సంతోషంగా ఉందని సిరిసహస్ర తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాది అంజనీకుమార్, చిన్న శ్రీను సోల్జర్స్ ఉపాధ్యక్షులు తోట వాసు తదితరులు పాల్గొన్నారు.



టిఫిన్ షాపు ప్రారంభిస్తున్న చిన్నశ్రీను సోల్జర్స్ అధ్యక్షురాలు సిరిసహస్ర

పెట్రోల్‌బంకులో తనిఖీలు

భోగాపురం: స్థానిక బీపీసీఎల్(భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్)బంకులో శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల బీపీసీఎల్ సెల్స్ అధికారి విందూరి అన్విత శనివారం తనిఖీలు చేపట్టారు. శుక్రవారం ఇదే పెట్రోల్‌బంకులో పెట్రోల్ కొనుగోలు చేసిన ద్విచక్ర వాహనదారుడు సీహెచ్ గోపి.. తాను కొనుగోలు చేసిన పెట్రోల్‌లో నీరు కలిసిదంటూ బంకు వద్ద సిబ్బందితో స్థానికులతో కలిసి వాగ్వాదానికి దిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీపీసీఎల్ సెల్స్ అధికారి బంకును తనిఖీ చేసి, ట్యాంకులో ఎంత పెట్రోల్ ఉంది? పెట్రోల్, డీజిల్ కోసం వచ్చే వాహనదారులు తమ వాహనాలకు ఎయిర్ కొట్టించే మిషన్ పనిచేస్తుందా లేదా, అలాగే వినియోదారులకు తాగునీరు అందుబాటులో ఉందా లేదా అనే విషయాలపై ఆరా తీశారు. ఇంతలో బంకులో తనిఖీలు జరుగుతున్నట్లు తెలుసుకున్న స్థానికులు బంకు వద్దకు చేరుకుని బంకులో జరుగుతున్న అవకతవకలపై సమాధానం చెప్పాలంటూ సెల్స్ అధికారిని ప్రశ్నించారు. తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారా ఏంటని సెల్స్ అధికారిని నిలదీశారు. కల్తీ లేని పెట్రోల్, డీజిల్‌ను అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆమె స్పందిస్తూ ఇకపై బంకులో ఎటువంటి కల్తీ జరగకుండా చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. ఆమె వెంట తహసీల్దారు రమణమ్మ, సీఎస్‌డీటీ మురళి, ఆర్‌ఐ ఇమ్రాన్, బంకు మేనేజర్ విజయ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెట్రోల్ కల్తీపై బీపీసీఎల్ సెల్స్ అధికారిని ప్రశ్నిస్తున్న వినియోగదారులు

ఘనంగా చర్చి వార్షికోత్సవం

విజయనగరం టౌన్: స్థానిక సిమ్స్ బాప్టిస్ట్ చర్చి 151వ వార్షికోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘమిత్ర ఆర్.ఎస్.జాన్..చర్చి ఆవిర్భావం నాటి నుంచి ఇప్పటివరకు ఉన్న పరిస్థితులను వివరించారు. చర్చి నిర్మించి 150 ఏళ్లు దాటి 151వ వసంతంలోకి అడుగెడుతుండడం ఆనందంగా ఉందన్నారు. కెనడా మేరీ టైమ్ బాప్టిస్ట్ మహాసభకు చెందిన డాక్టర్ సేన్‌ఫోర్ట్ భీమిలి నుంచి ఇక్కడకు వచ్చి 1875 నవంబర్‌లో ఇక్కడ సంఘాన్ని స్థాపించి, 50 ఏళ్లపాటు క్రైస్తవ ఆధ్యాత్మిక సేవలతో పాటు విద్యాభివృద్ధికి కృషి చేయడం జరిగిందన్నారు. తర్వాత కాలంలో దీనికి సిమ్స్ మెమోరియల్ బాప్టిస్ట్ చర్చిగా నామకరణం చేశారన్నారు. కార్యక్రమంలో భాగంగా క్విజ్, బైబిల్ రిఫరెన్స్, పాటల పోటీలు విద్యార్థులకు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గుంటూరు సత్తెనపల్లి డేనియల్ రాజు దైవసందేశం చదివి వినిపించారు. కార్యక్రమంలో సిమ్స్ జూబ్లీ కమిటీ చైర్మన్ ఎం.ఎ.నాయుడు, కార్యదర్శి ఆనందరావు, వై.ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సంఘమిత్ర ఆర్.ఎస్.జాన్

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



ఆటోస్టాండ్ వద్ద నిరసన తెలుపుతున్న ఆటోడ్రైవర్లు, ఏఐటీయూసీ నాయకులు

విజయనగరం గంటస్తంభం: వాహనమిత్ర పథకాన్ని ఆటో, మ్యాక్సీ, ట్యాక్సీ, జీపు వాహనాల డ్రైవర్లందరికీ వర్తింపజేయడంతో పాటు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి ఆదుకోవాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కోరారు. స్థానిక బుచ్చెన్న కోనేరు జంక్షన్ వద్ద ఉన్న ఆటోస్టాండ్ దగ్గర ఆటోడ్రైవర్లతో కలిసి శనివారం నిరసనకు దిగిన ఆయన..ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం ఇవ్వడం వల్ల ఆటో, మ్యాక్సీ, జీపు, వ్యాన్ డ్రైవర్లకు ఎంతో నష్టమని, జీవనోపాధి కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ప్రకటించిన వాహన మిత్ర పథకం అన్ని వాహనాల డ్రైవర్లకు వర్తించేలా చూడాలన్నారు.

ప్రతి డ్రైవర్‌కు పెన్షన్, పీఎఫ్‌తో పాటు రూ.5 వేల పెన్షన్‌తో కూడిన సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అప్పరుబోతు జగన్నాథం, పొందూరు అప్పలరాజు, బూరవాసు, వద్దాది కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

భగవద్గీత పఠన పోటీలు

విజయనగరం: స్థానిక రోటరీ సెంట్రల్ క్లబ్ నవతరోత్సవాల్లో భాగంగా నగరంలోని ఓ ప్రైవేటు హోటల్‌లో భగవద్గీత శ్లోకాల పఠన పోటీలు శనివారం నిర్వహించారు. మూడు విభాగాల్లో జరిగిన ఈ పోటీలకు మొత్తం 160 మంది విద్యార్థులు హాజరై శ్లోకాల పఠనంలో తమ ప్రతిభ కనబరిచారు. అనంతరం నిర్వాహకులు పోటీల విజేతలను ఖరారు చేశారు. కార్యక్రమంలో టి.ఎల్.ఎన్.మూర్తి, ఎం.శ్రీనివాస్, విజయ్‌కుమార్ అగర్వాల్, ఉదయ్, రోహిత్ సంజయ్, కృష్ణతేజ, చెన్నాప్రదీప్, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



కొత్త కార్యవర్గ సభ్యులు వీరే..

విజయనగరం అర్బన్: ఏటీఏ(ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్) జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక స్థానిక జిల్లా పరిషత్ మినిస్టీరియల్ సిబ్బంది హాల్‌లో శనివారం జరిగింది. సంఘ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మువ్వల అమర్‌నాథ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నిక ఏకగ్రీవం కాగా ప్రధాన కార్యదర్శిగా అసరి తవిటదొర, అధ్యక్షుడిగా పాడి రమేష్, కోశాధికారిగా మేకల సత్యనారాయణ, సహాధ్యక్షుడిగా మండంగి కిశోర్‌కుమార్, సహాయ కార్యదర్శిగా పోలుబొంగు దారరాజు, గౌరవాధ్యక్షుడిగా కొండగొర్రి చెల్లయ్య, జిల్లా కార్యదర్శులుగా 12 మంది ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేశారు.

ముగిసిన వర్క్‌షాప్



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కళాశాల డైరెక్టర్ శశిభూషణరావు

విజయనగరం అర్బన్: పట్టణంలోని సీతం ఇంజినీరింగ్ కళాశాలలో కృత్రిమ మేధ, డేటా సైన్స్ విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించిన 'స్టాక్ పైథాన్ డెవలప్‌మెంట్' వర్క్‌షాప్ శనివారం ముగిసింది. ట్రైనర్ టి.రవికిరణ్ మాట్లాడుతూ పోటీ కోడింగ్ పట్ల విద్యార్థులు ఆసక్తి కనబరచాలన్నారు. కళాశాల డైరెక్టర్ ఎం.శశిభూషణరావు మాట్లాడుతూ ఈ వర్క్‌షాప్ ద్వారా ఇంటెన్సివ్ డిజైన్ నుంచి సర్వర్ సైడ్ స్క్రిప్టింగ్, డేటాబేస్ మేనేజ్‌మెంట్ వరకు ఇలా అన్ని విషయాలు తెలుసుకోగలిగారన్నారు. అనంతరం వర్క్‌షాప్‌లో పాల్గొన్న విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులకు అండగా 'మేమున్నాం'



హాస్టల్ వార్డెన్‌కు ఫ్యాన్లు అందజేస్తున్న మేమున్నాం సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: ప్రభుత్వ వసతిగృహాల్లో ఉంటూ విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు తాము అండగా ఉన్నామని మేమున్నాం అనే స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు కేఎస్ఎన్ మూర్తి అన్నారు. పద్మావతినగర్ మొదటి లైన్‌లోని ప్రభుత్వ వెనుకబడిన వసతిగృహం(బాలురు)కు సంస్థ తరఫున ఫ్యాన్లు శనివారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు అన్ని మౌలిక సదుపాయాలతో పాటు ఆహ్లాదకరమైన వాతావరణం ఉంటే వారు మరింత బాగా చదువుకునేందుకు వీలుంటుందన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ బాలు, సంస్థ ప్రతినిధులు పద్మావతి, మేరీ, చంద్రశేఖర్, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తా



కోలగట్ల శ్రావణిని కలిసి అభినందనలు తెలియజేస్తున్న గొల్లలపేట మహిళలు

- వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి

విజయనగరం: వైఎస్సార్ సీపీ మరింత బలోపేతానికి కృషి చేస్తానని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి కోలగట్ల శ్రావణి అన్నారు. పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఆమెకు ఇటీవల పార్టీ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించగా, కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఆమెకు పార్టీ నాయకులు, కార్యకర్తల నుంచి శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి.

ఈ మేరకు పార్టీ నాయకుడు రామునాయుడు ఆధ్వర్యంలో గొల్లలపేటకు చెందిన 200 మంది మహిళలతో పాటు నగరంలోని 25వ డివిజన్‌కు చెందిన అట్టాడ చందు, కరణం భాస్కరరావుల ఆధ్వర్యంలో పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆమెను నగరంలోని మాజీ డిప్యూటీ స్పీకరు కోలగట్ల వీరభద్రస్వామి నివాసంలో శనివారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో అధిష్టానం ఈ బాధ్యతను అప్పగించిందని, వారి విశ్వాసాన్ని వమ్ము చేయకుండా పార్టీ అభివృద్ధికి పాటుపడతానన్నారు. పార్టీని నమ్ముకుని పనిచేసిన వారికి ఎప్పుడూ పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. మహిళా నాయకత్వాన్ని బలపరచడంపై దృష్టిసారిస్తానన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

నెల్లిమర్ల రూరల్: గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ గణేష్ హెచ్చరించారు. భద్రతా చర్యల్లో భాగంగా మండలంలోని సతివాడ గ్రామంలో ఆరు సీసీ కెమెరాలను శనివారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేర నియంత్రణ, ఇటీవల గ్రామంలో తలెత్తిన శాంతి భద్రతల సమస్య వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఆదర్శ పాఠశాల, ఎస్సీ కాలనీ, రామమందిరాల వద్ద రెండేసి చొప్పున సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజలు, విద్యార్థుల భద్రత నేపథ్యంలో వాటిని ఏర్పాటు చేశామన్నారు. విద్యాసంస్థల వద్ద అల్లరి చేష్టలకు పాల్పడుతున్న వారిని ఇప్పటికే గుర్తించామని వారికి కౌన్సిలింగ్ కూడా ఇచ్చామన్నారు. బాలికల పట్ల ఈవ్‌టీజింగ్‌కు పాల్పడితే ఉపేక్షించబోమని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో వర్గాలుగా విడిపోయి అలజడులు సృష్టిస్తే తీవ్రమైన చర్యలు ఉంటాయన్నారు. యువత కేసుల బారినపడి జీవితాలు నాశనం చేసుకోవద్దని హితవుపలికారు.



మాట్లాడుతున్న ఎస్‌ఐ గణేష్

వారం రోజులైనా చర్యలు తీసుకోకపోవడం బాధాకరం



మాట్లాడుతున్న జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా నాయకులు

నెల్లిమర్ల రూరల్: మండలంలోని సతివాడ గ్రామంలో ఉన్న ఎస్సీలపై సామాజిక బహిష్కరణ ఘటనలో వారం రోజులైనా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం చాలా బాధాకరమని జైభీమ్‌రావ్ భారత్ పార్టీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టొంపల నరసయ్య, కనిగిరి శ్రీనివాసరావులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామానికి శనివారం వెళ్లిన వారు బాధితులను కలిసి సంఘీభావం తెలిపారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన ఎస్సీల గణేష్ నిమజ్జనాన్ని బీసీలు అడ్డుకున్నారని, ఎఫ్ఐఆర్‌లు నమోదైన వారిని తక్షణమే అరెస్టు చేయాలని లేదంటే రోడ్లపైకి వచ్చి నిరసనలు తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ఎయిమ్ మండల కన్వీనర్ బూసరి అప్పలరాజు, కో–కన్వీనర్ మాలచ్చి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దివస్

శృంగవరపుకోట: మండలంలో భవానీనగర్‌లో గల డీపీఎల్ పబ్లిక్ స్కూల్‌లో హిందీ దివస్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. బహుభాషా కోవిదుడు రాజేంద్ర సింహా జన్మదినాన్ని పురస్కరించుకుని హిందీ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా హిందీ భాష గొప్పతనాన్ని వక్తలు వివరించారు. పాఠశాల ప్రిన్సిపాల వై.జానకీదేవి మాట్లాడుతూ.. భారతదేశాన్ని కలిపి ఉంచేది హిందీ భాషేనని చెప్పారు. హిందీ నేర్చుకోవడం ద్వారా భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



హిందీ గొప్పతనం చాటుతూ విద్యార్థినుల నృత్య ప్రదర్శన

పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వంలో రైతులకు యూరియా కష్టాలు వీడడం లేదు. యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న తరుణంలో కె.కొత్తవలస రైతుసేవా కేంద్రం వద్ద పోలీసుల సమక్షంలో శనివారం యూరియా పంపిణీ చేశారు. ఒక్కొక్కరికీ ఒక్కో బస్తా చొప్పున అందజేశారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో లేని ఇబ్బందులు ఇప్పుడెందుకు వచ్చాయో అర్థం కావడం లేదని అన్నదాతలు వాపోయారు.

నిలిచిన యూరియా పంపిణీ..

మండలంలోని ఇంగిలాపల్లి రైతుసేవా కేంద్రం వద్ద యూరియా నిల్వలు లేకపోవడంతో శనివారం సరఫరా నిలిపివేశారు. పెదమానాపురం పోలీసుల సమక్షంలో ఉదయం నుంచి స్లిప్పులు పంపిణీ చేసినా యూరియా మాత్రం ఇవ్వలేకపోయారు. రైతులందరికీ సరిపడా ఎరువు లేదని, రెండు రోజుల్లో సరుకు తెప్పించి ఇస్తామని వ్యవసాయ సిబ్బంది తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు పాట్లు తప్పడం లేదని రైతులు గర్బాపు శ్రీను, కొల్లి తిరుపతి, రామకృష్ణ, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు.



కె. కొత్తవలస రైతుసేవా కేంద్రం వద్ద పోలీసుల సమక్షంలో యూరియా పంపిణీ